క్లుప్తంగా

ఇంటింటా నాంచారమ్మ దర్శనం

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం తూర్పు బజారులో ఇంటింటా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. పసుపు, కుంకుమ, పండ్లు, పూలు సమర్పించి టెంకాయలు కొట్టి కానుకలు చెల్లించి అమ్మవారి దీవెనలు పొందారు. మేళతాళాలు, డప్పుకళాకారుల సందడితో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు బాలోత్సవ్ వేడుకలు

కోడూరు: విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం బాలోత్సవ్ వేడుకలను నిర్వహిస్తామని ఎంఈఓ టీవీఎం రామదాసు మంగళవారం తెలిపారు. కోడూరు ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని, ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని వెంకట్రామయ్య (నాని), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, డీఈఓ తాహెరా సుల్తానా, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. సాయంత్రం చిన్నారులకు వేషధారణ పోటీలు, జాతీయ నాయకుల వేషధారణలో శోభాయాత్ర జరుగుతుందని వివరించారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

మోపిదేవి: గృహ నిర్మాణాలను ఉగాదిలోగా పూర్తిచేయాలని మచిలీపట్నం ఆర్డీఓ కిషోర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మండలంలో 954 మందికి జగనన్న లేఅవుట్స్‌లో పట్టాలు ఇచ్చామని చెప్పారు. వీటిలో 11 లే అవుట్స్‌కు లెవెలింగ్ చేయాల్సి ఉండగా దగ్గరలోని కృష్ణానది నుంచి ఇసుక, మట్టి తరలించి మెరక చేయాల్సి ఉందన్నారు. పనులు వెంటనే పూర్తి చేసి గృహ నిర్మాణాలు ఉగాదికి పూర్తి చేస్తామని వివరించారు. తహసీల్దార్ కె. నవీన్ కుమార్, ఎంపీడీఓ పార్వతి, గృహ నిర్మాణ శాఖ ఏఈ తాండవకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం నాగాయితిప్ప లే అవుట్‌ను పరిశీలించారు.

నేడు ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

మచిలీపట్నంటౌన్: గొడుగుపేటలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం జరుగుతుంది. ఉదయం 7.38 గంటలకు స్వామివార్ల విగ్రహాలు, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు హాజరవుతారన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంజినీరింగ్ సహాయకులకు శిక్షణ

పెడన: ఇంజినీరింగ్ పనుల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడవద్దని విజయవాడ డివిజన్ క్వాలిటీ కంట్రోల్ విజిలెన్స్ శాఖ ఈఈ ఎల్. ఏడుకొండలు అన్నారు. మండలంలోని సచివాలయాలకు చెందిన ఇంజినీరింగ్ సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

పదవులకు వన్నె తేవాలి

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ కృష్ణా జిల్లా అధ్యక్షునిగా నియమితులైన కరార్ మూసవి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన వీఏఎస్ మూర్తి సమర్థవంతంగా పనిచేసి పదవులకు వన్నె తీసుకురావాలని ఆ పార్టీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. కరార్ మూసవి, మూర్తిలను మంగళవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా సన్మానించారు. డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్‌సాహెబ్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, షేక్ అచ్చెబా తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

మచిలీపట్నంటౌన్: స్థానిక సర్వజన ఆస్పత్రిలో నిర్వహిస్తున్న గర్భకోశ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కె. విజయకుమారి అన్నారు. మాతా, శిశు విభాగంలో మంగళవారం గర్భకోశ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భకోశ క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే వైద్యం ద్వారా తగ్గించవచ్చునని వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జి. వరప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- మంత్రి జోగి రమేష్
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

పెడన: సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం సాయంత్రం పెడన 11వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గృహానికి వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ఇళ్లస్థలాలు ఇచ్చామని, త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న ఇసుక, ఐరన్, సిమెంట్ కాకుండా డ్వాక్రా ద్వారా రుణం తీసుకుని ఇళ్లను పూర్తి చేసుకోవాలన్నారు. మరికొందరికి ఓటీఎస్ పత్రాలను అందించారు. ఇళ్ల స్థలం వచ్చిందా అంటూ పలువురిని ప్రశ్నించిన మంత్రి వచ్చిందని వారు చెప్పడంతో ముద్రించిన కరపత్రంలో నమోదు చేయకపోవడంపై సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన లబ్ధి విషయంలో కచ్చితంగా లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. అమ్మమ్మ ఇల్లు నిర్మిస్తున్న సమయంలో మొదటి బిల్లు మంజూరైన తరువాత చనిపోయిందని, దీంతో మనుమడు ఇబ్బందులు పడుతున్నాడని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో న్యాయపరమైన సమస్యలుంటే వాటిని తక్షణం పరిష్కరించి మనుమడి పేరుతో బిల్లులు మంజూరయ్యేలా చూడాలని తహసీల్దార్ పి. మధుసూదనరావుతో పాటు హౌసింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కటకంప్రసాద్, కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల గోపీ, రహమతున్నీసా, కమిషనర్ అంజయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, నాయకులు పాల్గొన్నారు.


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

రావివారిపాలెం(మోపిదేవి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి సచివాలయం-2 పరిధిలోని రావివారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు యువనేత సింహాద్రి వికాస్‌బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావుతో కలిసి 218 గృహాలను సందర్శించారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని స్థానికులు తెలుపగా సర్పంచ్ నందిగం మేరీరాణి, గ్రామ కార్యదర్శి త్రిపురసుందరితో మాట్లాడి ఇప్పుడు ఇస్తున్న రెండు పూటల కుళాయి నీటిని అవసరమైతే మధ్యాహ్న సమయంలో కూడా అదనంగా వదలాలని ఎమ్మెల్యే సింహాద్రి సూచించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శనీయమన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ఆశీర్వదించాలని కోరారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రామప్రసాద్, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, బీసీ మండల కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు, నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సింహాద్రిని దీవిస్తున్న వృద్ధ దంపతులు

జగన్ పాలనలో మేలులు జరిగాయి

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమకు మేలులు జరిగాయని పలువురు మహిళలు వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) వద్ద ఆనందం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం 21వ డివిజన్ బందరుకోటలో నిర్వహించారు. పేర్ని కిట్టు గృహాలను సందర్శించగా ప్రతి గడపలోనూ తమకు ఫలానా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఈ పథకాల మొత్తాలతో కుటుంబ జీవనం మెరుగుపడిందని లబ్ధిదారులు చెప్పారు. తమ కాలనీలో రహదారులు అభివృద్ధి చేయాలని బొర్రా వెంకటస్వామి కాలనీ మహిళలు విజ్ఞప్తి చేశారు. కిట్టు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్పొరేటర్ మన్నే శారద, డివిజన్ ఇన్‌చార్జి మన్నే శేషారావు, కార్పొరేటర్లు తిరుమలశెట్టి ప్రసాద్, రామిశెట్టి వాణిశ్రీ, మాచవరపు రాంప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, బూరగ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ తరహా వైద్యం

కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో మంగళవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా ఆసుపత్రిలో రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించాలన్నారు. సరిగా వైద్యం అందించని ఆస్పత్రులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సుమన్, డీఎంహెచ్‌ఓ గీతాబాయి, డీసీహెచ్‌ఎస్ ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు

మచిలీపట్నంటౌన్: సైన్స్ డే సందర్భంగా మంగళవారం నగరంలోని పలు పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించారు. విద్యార్థులు పలు అంశాలపై ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. గిలకలదిండిలోని మునిసిపల్ హైస్కూల్‌లో ప్రదర్శనను కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్, విద్యార్థులు తిలకించారు. జవ్వారుపేటలోని వేంకటేశ్వర పబ్లిక్ స్కూల్‌లో 4, 5 తరగతుల విద్యార్థులు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. సోలార్ సిస్టమ్, విండ్‌మిల్, వాటర్ సైకిల్, ఫోటోసింతసిస్, మోడల్స్ ఆఫ్ హార్ట్, సోలార్ ప్యానల్ తదితర ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. బందరు కోట మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 44 అంశాలకు సంబంధించిన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ రఘుకాంత్ బహుమతులు అందజేశారు. నారాయణ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పరిశీలించి విద్యార్థులను అభినందించారు.

- పెడన: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాంజలి పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- రామానగరం (చల్లపల్లి): స్థానిక వాగ్దేవి చల్లపల్లి పబ్లిక్ స్కూల్‌లో హైడ్రో పవర్ స్టేషన్ ప్రయోగం, అగ్ని పర్వతాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే వాల్కనిక్ ఎనర్జీ విధానం, ఎలక్ట్రోప్లేటింగ్, విండ్ ఎనర్జీ, నీటి పరిశుభ్రత విధానాలు, సొంతంగా వాక్యూమ్ క్లీనర్ తయారీ, అడవుల పరిరక్షణ విధానాలతో పాటు మొత్తం 158 అంశాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. రామానగరం శ్రీచైతన్య స్కూల్‌లో, విజయా అకాడమీలో, చల్లపల్లి ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులు చేసిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి.


బందరులో ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

- గూడూరు: కప్పలదొడ్డి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి తిలకించి విద్యార్థులను అభినందించారు. మల్లవోలు జెడ్పీ హైస్కూల్‌లో సర్ సీవీ రామన్ చిత్రపటానికి హెచ్‌ఎం వి.పాండురంగారావు పూలమాల వేసి నివాళులర్పించారు.
- కోడూరు: స్థానిక కోట రాఘవయ్య విద్యాసంస్థలు, జీవీ అకాడమీ, లిటిల్ ఫ్లవర్ పాఠశాలల్లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలు ఇచ్చారు. మానవ శరీరంలో అవయవాలు పని చేసే విధానం, వ్యర్థాలతో సంపద, ప్లాస్టిక్ వస్తువుల నిషేధం, మహిళల భద్రతకు ప్రత్యేక యాప్, దిశ చట్టం తదితర అంశాలతో రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోడూరు మెయిన్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు భవనాల నమూనాలు, మొక్కల పెంపకంపై ప్రదర్శన ఇచ్చారు.
- మోపిదేవి: మోపిదేవి మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ వీర రవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకొని యువ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.
- బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి పాఠశాల, సెంట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కొమ్మారెడ్డి పాఠశాల డైరెక్టర్ కె.కిషోర్ విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు.

టైలర్ల కష్టాలు గుర్తించిన సీఎం జగన్

చల్లపల్లి: రాష్ట్రంలో నిరుపేద టైలర్లు పడుతున్న కష్టాలను గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని సీనియర్ టైలర్, సీహెచ్‌సీ డైరెక్టర్ అబ్దుల్ కరీం అన్నారు. మంగళవారం స్థానిక బాబా సెంటర్ వద్ద టైలర్స్ డే వేడుకలు చల్లపల్లి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కరీం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టైలర్ల దుకాణాల అద్దె, ఖర్చుల కోసం ప్రతి ఏటా మంజూరు చేస్తున్న జగనన్న చేదోడు పథకం సహాయం రూ.10 వేలను సద్వినియోగం చేసుకోవాలని, వృత్తిపరంగా శ్రమించి పొందుతున్న కష్టార్జితాన్ని జాగ్రత్త చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని కోరారు. అసోసియేషన్ పెద్దలు యడ్ల రాము, అమ్ముల నాగేశ్వరరావు, విన్నకోట వెంకటేశ్వరరావు, అధ్యక్షులు సయ్యద్ జహీర్, ఉపాధ్యక్షులు అమీర్ జానీ, ట్రెజరర్ ఎండీ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

కోడూరు: టైలర్స్ డే వేడుకలను దర్జీలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్ నుంచి వంతెన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. రెడీమెడ్ దుస్తులు వచ్చిన తరువాత దర్జీల పరిస్థితి దయనీయంగా మారిందని, దర్జీలకు 45 సంవత్సరాలకు పింఛన్‌ను ఇవ్వాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. పేదలకు పండ్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు భూపతి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

- పెడన: టైలర్స్ దినోత్సవాన్ని స్థానిక బంగ్లా స్కూల్ వద్ద మంగళవారం నిర్వహించారు. కుట్టుమిషన్‌ను కనుగొన్న విలియం హోవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు కడప బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టైలర్స్ సంక్షేమాన్ని గుర్తించి ఏడాదికి రూ.10 వేలు ఇవ్వడం సంతోషకరమన్నారు. సంఘ నాయకులు పద్మ, మహమ్మద్ ఇలియాస్, ఎండీ రషీద్, రాము, రఫీ, ఖాదర్, అమీన్, బాషా, మధు, బుజ్జి పాల్గొన్నారు. అనంతరం టైలర్లు తులసీరావు, వెంకటేశ్వరరావు, అబ్దుల్‌రజాక్, ఎండీ ఇలియాస్, చోటాలను సన్మానించారు.


పెడనలో విలియం హోవే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టైలర్లు

బంటుమిల్లి: స్థానిక గాంధీ మండపంలో విలియం హోవే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విలియం హోవే సేవలను కొనియాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పట్టపు నాని ఎన్నికయ్యారు. సభ్యులు ధనంజయరావు, ఫణిభూషణ్‌రావు, అహ్మద్ ఖాన్, సీఐటీయూ నాయకులు, టైలర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల నిర్ధారణకు అధికారుల సర్వే

గూడూరు: వక్ఫ్ బోర్డుకు సంబంధించి గూడూరు గ్రామంలో ఉన్న ఆస్తుల నిర్ధారణకు వక్ఫ్ బోర్డు సర్వే విభాగం అసిస్టెంట్ కమిషనర్ కె.రమణమూర్తి ఆధ్వర్యంలోని అధికారుల బృందం మంగళవారం గూడూరులో సర్వే నిర్వహించారు. వక్ఫ్ బోర్డు గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఉన్న ఆస్తులను సర్వే నెంబరు 393-1 నుంచి విడదీసి ప్రత్యేక సబ్ డివిజన్ చేయడం ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు నిర్ధారణకు వచ్చి ఆమేరకు చర్యలు చేపట్టారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, గూడూరు పీఏసీఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావు, తహసీల్దారు బీవీ ప్రసాద్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజామస్తాన్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా తెలిపారు. ఈ నెల 6, 7 తేదీల్లో జరుగనున్న అమ్మవారి తిరునాళ్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో ఆలయ ప్రాంగణం వద్ద మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి అధికారులకు సూచనలు చేశారు. ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

బాధిత కుటుంబాలతో టీడీపీ నీచ రాజకీయం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: మానవతావాదంతో జగనన్న ప్రభుత్వం పనిచేస్తుండగా టీడీపీ నాయకుడు మండలి బుద్ధ ప్రసాద్ నీచ రాజకీయాలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. రావివారిపాలెంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చల్లపల్లి మండలం చింతలమడ గ్రామస్తులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధితులకు ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిహారం చెల్లించే సమయంలో బయటకు వచ్చి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఆ ఘటన సమయంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి గాయపడిన బాధితులకు మంచి వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రమాద వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేందుకు తాను ప్రభుత్వానికి లెటర్ కూడా పంపానని చూపించారు. ప్రభుత్వం నుంచి స్పందన వచ్చే సమయంలో తాము గొడవ చేయబట్టే ప్రభుత్వం సాయం చేసిందని చెప్పుకునేందుకు టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సమస్యలపై ఎప్పుడూ బయటకు రాని బుద్ధప్రసాద్ రానున్న ఎన్నికల్లో సీటు రాదేమోనన్న భయంతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

బైక్ దహనంపై ఫిర్యాదు

గూడూరు: గూడూరుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కె.శ్రీనివాసరావు ఇంటి ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాన్ని సోమవారం రాత్రి దుండగులు తగులబెట్టారు. ఈ మేరకు బాధితుడు మంగళవారం గూడూరు పోలీసులను ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ వి.వెంకటేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పెన్షన్‌దారుల సాయం

మచిలీపట్నంటౌన్: 25వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు నాయుడు వెంకన్న మృతిచెందాడు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 30వేలను వెంకన్న భార్యకు మంగళవారం అందజేశారు. కొలుసు హరిబాబు పాల్గొన్నారు.